


సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 524.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.60 అడుగుల వద్ద ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు.



పుస్తకాల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1972 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం లైబ్రరీకి రూ.3 లక్షలు ఖరీదుచేసే 94 పుస్తకాలను ప్రిన్సిపాల్ ఉమాజ్యోతికి అందజేశారు.

జెడ్పీలో మిర్చి ఘాటు

- నకిలీ విత్తనాలపై గరం గరం
- అధికారులను నిలదీసిన ఉమ్మారెడ్డి
- అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు
- వాడీవేడిగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, వేదికపై ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, గుంటూరు జిల్లా జేసీ రాజకుమారి, పల్నాడు జిల్లా జేసీ శ్యాంప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: నకిలీ మిర్చి విత్తన విక్రయాలపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. నకిలీ విత్తనాలను విక్రయించి, రైతులను మోసం చేసిన డీలర్లపై చర్యలు చేపట్టడంలో తాత్సారం చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులపై శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతోపాటు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకుని, సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకునే విషయంపై వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై జోక్యం చేసుకున్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు నకిలీ విత్తనాలు విక్రయించినట్లు విచారణలో రుజువైన తరువాత వ్యాపారులపై కేసుల నమోదుతోపాటు శాఖాపరంగా ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. గత 30 ఏళ్లలో నకిలీ విత్తనాలను విక్రయించిన ఏ ఒక్క వ్యాపారి తన వ్యాపారం మానుకోలేదని, అధికారులంటే వారికి ఏపాటి భయం ఉన్నదో చెప్పేందుకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. నకిలీ విత్తన విక్రయాలపై కమిషనర్‌కు నివేదిక పంపినట్లు అధికారులు బదులివ్వగా, ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించి, చేతులు దులుపుకుంటే చాలదని, చట్ట ప్రకారం కేసులు ఎందుకు నమోదు చేయించలేదని నిలదీశారు.

వైద్యారోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులు

గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో కాన్పులు చేయడం లేదని పలువురు జెడ్పీటీసీలు సమావేశంలో లేవనెత్తిన అంశాలపై మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో గతంలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మక మార్పులు వచ్చాయని వివరించారు. రూ.కోట్ల వ్యయంతో పీహెచ్‌సీల్లో పరికరాలను ప్రభుత్వం సమకూర్చిందని చెప్పారు. సిబ్బంది, వైద్యులు అంకితభావంతో పనిచేసి ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు.

మరిన్ని ముఖ్యాంశాలిలా..

- గుంటూరు శివారు నల్లపాడులోని గొర్రెల మండిలో జరుగుతున్న క్రయ, విక్రయాలపై మార్కెటింగ్ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు జెడ్పీటీసీలు చేసిన ఆరోపణలపై మంత్రి అంబటి రాంబాబు అధికారులను నిలదీశారు. ప్రభుత్వం నుంచి అనుమతి ఉందా, ఉంటే సెస్సు రూపంలో ఎంత చెల్లిస్తున్నదీ చెప్పాలని ప్రశ్నించారు. దీంతో అధికారులు నీళ్లు నమిలారు.
- ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని గుంటూరు డీఈఓ పి.శైలజపై పలువురు జెడ్పీటీసీలు మంత్రి అంబటికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తనకూ ఫిర్యాదులు అందాయని, పద్ధతి మార్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా సభాముఖంగా డీఈఓ శైలజకు సూచించారు.
- ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులెవరూ ప్రొటోకాల్ పాటించడం లేదని తాడికొండ జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీగా ఉండి, ప్రయోజనమేమిటని, తక్షణమే రాజీనామా చేస్తానని సభా వేదిక వద్దకు వెళ్లారు. దీనిపై జోక్యం చేసుకున్న మంత్రి అంబటి, హెనీ క్రిస్టినా ఆమెను వారించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.
- బదిలీలు, ఉద్యోగోన్నతుల అనంతరం పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో ఏర్పడిన ఖాళీల భర్తీకి ఏం చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు పల్నాడు, గుంటూరు డీఈఓలు శామ్యూల్, శైలజ సమాధానమిచ్చారు. ఆయా ఖాళీలను ఎంటీఎస్ ఉపాధ్యాయులతో భర్తీ చేస్తున్నట్లు చెప్పారు.
- పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ పెదవడ్లపూడి హైలెవల్ చానల్ నుంచి నంబూరు మీదుగా చేబ్రోలులోని శివారు ప్రాంతాలకు నీటిని అందించే పనులు పూర్తి చేయాలని చెప్పారు. దీనిపై అధికారులను వివరాలు కోరిన మంత్రి అంబటి పనులు పూర్తికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
- గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేయడంతోపాటు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు శాతం గణనీయంగా పెరిగిందని, బయోమెట్రిక్ ద్వారా రోజూ 98 శాతం మేర హాజరు నమోదవుతున్నట్లు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్, హెల్త్ అండ్ వెల్‌నెస్ విధానాలు విజయవంతమయ్యాయని, పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.
- సత్తెనపల్లిలోని జెడ్పీకి చెందిన ఎకరం 10 సెంట్ల స్థలంలో 40 ఏళ్లకు పైబడి నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు జెడ్పీ సమావేశంలో ఆమోదించి, ప్రభుత్వానికి పంపాల్సిందిగా మంత్రి అంబటి రాంబాబు సూచించారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు వివిధ సమస్యలను ప్రస్తావించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, గుంటూరు, పల్నాడు జేసీలు బి.రాజకుమారి, శ్యాంప్రసాద్, జెడ్పీ సీఈఓ జె.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.24 కోట్లతో 484 అభివృద్ధి పనులు

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.24 కోట్లతో 484 అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. జెడ్పీ కార్యాలయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జెడ్పీ పరిపాలనాధికారులుగా 20 మందికి ఉద్యోగోన్నతులు కల్పించగా, సీనియర్ అసిస్టెంట్–19, టైపిస్ట్–ఏడు, రికార్డు అసిస్టెంట్లుగా 19 మందితో కలుపుకుని మొత్తం 55 మందికి ఉద్యోగోన్నతులు కల్పించామని వివరించారు. ఉద్యోగుల బదిలీలను పారదర్శక విధానంలో చేపట్టామని తెలిపారు. కారుణ్య నియామాల ద్వారా 65 మందికి ఉద్యోగాలను కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గత విద్యాసంవత్సరంలో పంపిణీ చేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఎంతో ప్రయోజనం చేకూర్చిందని, ఈ ఏడాది నవంబర్‌లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

గుంటూరు చానల్ భూసేకరణకు రూ.110 కోట్ల విడుదలకు కృషి

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

ఆగస్టు నెలలో ఇలాంటి వర్షాభావ పరిస్థితులు గత 122 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేవని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌తోపాటు శ్రీశైలం ప్రాజెక్టులోనూ నీరు లేదని, అయినా సాగర్ కుడికాలువ నుంచి ఖరీఫ్‌కు నీరు ఇచ్చేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల దిశగా రైతులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. గుంటూరు చానల్ భూసేకరణకు అవసరమైన రూ.110 కోట్ల విడుదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అలాగే వరికపూడిశెల నిర్మాణ పనులనూ వేగవంతం చేయిస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

గాజుల అలంకారంలో పల్నాటి వీర్ల అంకాలమ్మ



కారెంపూడి: పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లికి శ్రావణ మాసం నాలుగవ శుక్రవారం గాజుల అలంకారం చేశారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు గాజులు పంపిణీ చేశారు. అంకాలమ్మకు బోనాలు సమర్పించే కార్యక్రమం వైభవంగా కొనసాగింది. శాలివాహనులు, నాయీబ్రాహ్మణులు, ఆదినారాయణ కాలనీ వాసులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి కుంకుమ బండ్లు కట్టి మొక్కులు చెల్లించారు. ముందుగా అంకాలమ్మ గుడికి చేరుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ ఆలయాలకు చేరుకుని అక్కడ అమ్మవార్లకు పోతురాజుకు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు.

4 టీఎంసీలు పెరిగిన పులిచింతల



అచ్చంపేట: వర్షాభావంతో పులిచింతల ప్రాజెక్టులో గణనీయంగా తగ్గిన నీటి నిల్వలు గత వారంగా కురుస్తున్న వర్షాలకు కొంత పెరిగాయి. ఎగువ నదీ పరీవాహక ప్రాంతాలలో కురిసిన వర్షపునీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. ఈనెల 2వ తేదీ నాటికి ప్రాజెక్టులో 20.5640 టీఎంసీలు ఉండగా, ప్రస్తుత నీటి మట్టం 24.5600 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 10,277 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.5,500, గరిష్ఠ ధర రూ.8,800, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

బాబు! నీ అవినీతి బాగోతానికి సమాధానం చెప్పు

ప్రభుత్వ విప్ పీఆర్కే డిమాండ్



మాచర్ల: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఐటీ నోటీసులు అందుకుని, రేపో మాపో అరెస్టు చేస్తారంటూ డ్రామాలాడుతున్నారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.118.98 కోట్లను లంచంగా తీసుకుని ఇంత వరకు సమాధానం ఎందుకు చెప్పటం లేదని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణం పేరుతో రెండు కంపెనీల వద్దే ఇన్ని ముడుపులు తీసుకుంటే ఇప్పటికి ఎన్ని వేల కోట్లు సంపాదించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. రూ.రెండు వేల కోట్లు లెక్కపత్రం లేని డబ్బులతో చంద్రబాబు పీఏ దొరికిపోయాడని ఆదాయపుపన్ను శాఖ ప్రకటించిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ఎంతో మంది వద్ద ముడుపులు పొందిన బాబు బినామీల పేరుతో డబ్బులు తన ఖాతాలో వేయించుకుని కాకమ్మ కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. పేదల ఇళ్లను లూటీ చేసిన చంద్రబాబు రూ.8వేల కోట్లతో ఇళ్ల నిర్మాణాలను షాపుంజి, పుల్లంజిలకు అప్పగించి ముడుపులు పొందిన మాట వాస్తవం కాదా అన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సీబీఐ, ఈడీ విచారణ జరిపి చంద్రబాబు అవినీతిని బట్టబయలు చేయాలని పిన్నెల్లి డిమాండ్ చేశారు. చంద్రబాబును వెనకేసుకొచ్చిన దత్త పుత్రుడు, ఈనాడు రామోజీ, రాధాకృష్ణ, టీవీ–5, ఎల్లో మీడియాల వాటాలూ తేల్చాలని కోరారు. ఐటీ నోటీసులు, హైదరాబాద్ జూబ్లీ హిల్స్ సర్కిల్‌లో మాత్రమే ఇవ్వాలని, సెంట్రల్ ఆఫీసులో ఇవ్వకూడదని బాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ''మొత్తం మీ ఆస్తుల మీద విచారణకు సిద్ధమా? ఎక్కడికక్కడ రాజీ పడుతూ కాళ్లు పట్టుకొని బతికే నువ్వు మా నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం గురించి మాట్లాడతావా?'' అంటూ బాబుపై పిన్నెల్లి ధ్వజమెత్తారు. చంద్రబాబు, లోకేష్‌ను అరెస్టు చేసి విచారించాలని కోరారు. ''అవినీతి పనులు బయటకు రాకుండా కేంద్ర ప్రభుత్వాన్ని మేనేజ్ చేసేందుకే కదా బాబూ సుజనా చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్‌ను బీజేపీలోకి చేర్పించావు'' అని పీఆర్కే ప్రశ్నించారు. ''కొత్తగా మీ వదిన పురందేశ్వరిని అడ్డం పెట్టుకొని మరో వైపు సీపీఐ రామకృష్ణ, నారాయణలనూ మేనేజ్ చేసే స్థాయికి దిగజారిన నువ్వొక బ్రోకర్‌వి''అంటూ చంద్రబాబునుద్దేశించి పీఆర్కే వ్యాఖ్యానించారు. నువ్వు జైలుకు పోవటం తప్పదు బాబూ మరోసారి వైఎస్సార్ కుటుంబం గురించి మాట్లాడితే నీ తాట తీస్తా అంటూ పీఆర్కే హెచ్చరించారు.

ఏపీజీఈఎఫ్ జిల్లా కొత్త కార్యవర్గం

నరసరావుపేట: నరసరావుపేటలోని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల (ఎస్ఎస్ఎన్) ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) పల్నాడు జిల్లా సమావేశం శుక్రవారం సాయంత్రం సంఘ జిల్లా కన్వీనర్ రొడ్డా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా కొత్త జిల్లా కమిటీలను నియమిస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా చైర్మన్ వందనబాబు, సెక్రటరీ జనరల్ అరవపాల్ మాట్లాడుతూ ఏపీజీఈఎఫ్ పల్నాడు జిల్లా నూతన చైర్మన్‌గా జి.వందనబాబుతోపాటు మరో 49 మందితో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు వివరించారు. రాష్ట్ర ట్రెజరర్ ఎస్.రామకృష్ణ, బీఆర్ఆర్ కిషోర్, అంకమ్మరావు తదితర రాష్ట్ర నాయకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీగా ఆళ్ల శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ కె.రామకృష్ణ, కో–చైర్మన్లుగా గబురు నాయక్, సదా శివారెడ్డి, వైస్ చైర్మన్లుగా ఇమ్మాన్యుయేల్‌రాజు, జి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.కుమార్, పి.శ్రీనివాస్ సాయి, జాయింట్ సెక్రటరీలుగా నరసింగరావు, ఎస్.సురేష్‌బాబు, పబ్లిసిటీ సెక్రటరీలుగా ఆర్.శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులందరికీ నియామకపత్రాలు అందజేశారు.

14న మినీ జాబ్‌మేళా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14న జిల్లా కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాల్‌లో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి కె.సంజీవరావు శుక్రవారం తెలిపారు. ఇతర వివరాల కోసం ఎం.వీరాంజనేయులును 91602 00652 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

షూటింగ్ బాల్ పోటీలకు నలుగురు విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో కళాశాల చైర్మన్ శేషగిరిరావు తదితరులు

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్టు కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు శు క్రవారం తెలిపా రు. బాపట్ల జిల్లా మార్టూరులో షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయిలో పోటీల్లో తమ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థిని షేక్ కరిష్మా, తృతీయ సంవత్సరం విద్యార్థిని కె.శ్రీలత, ఎంఏఎం ఫార్మసీ కళాశాల విద్యార్థినులు షేక్ అఫ్రీన్, వి.భార్గవి ప్రతిభ చాటినట్టు తెలిపారు. కావలిలో ఈనెల 8,9,10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినుల్ని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డి.శ్రావ్య, అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా విను'కొండ'పై ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే బొల్లా
- మాజీ ఎమ్మెల్యేలు మక్కెన, జీవీ, జేసీ శ్యామ్‌ప్రసాద్
- ఆలయ నిర్మాణానికి రూ.3 కోట్లపైగా విరాళాలు
- తిరుమల గ్రూప్ కంపెనీ రూ.కోటి అందజేత



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా, జేసీ శ్యాం ప్రసాద్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై రామలింగేశ్వర స్వామి నూతన దేవాలయ శంకుస్థాపక కార్యక్రమం వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఉదయం స్వామివారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం ప్రారంభమైంది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు మక్కెన మల్లికార్జున రావు, జి.వి ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వేద పండితుల మంత్రాల నడుమ ప్రత్యేక హోమం అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు, పుర ప్రజల సమక్షంలో కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పురాతన దేవాలయం తొలగించిన అనంతరం దేవాలయ ప్రాంగణం చదును చేసి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దేవాలయం నిర్మాణానికి భారీ గా విరాళాలు..

రామలింగేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి భారీగా విరాళాలు ఇచ్చారు. తొలిరోజున రూ.3 కోట్లకు పైగా విరాళాలు ప్రకటించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వ్యాపార భాగస్వాములు తిరుమల గ్రూప్ ఆఫ్ ఆఫ్ కంపెనీకి చెందిన నలబోతు వెంకట్రావు, దండా బ్రహ్మానందం, రావెల సత్యనారాయణ ఆలయ నిర్మాణానికి కోటి రూపాయల భారీ విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యే రూ.75 లక్షలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు రూ.25 లక్షలు, అప్పరాజు దేవమ్మ అనే భక్తురాలు రూ.25 లక్షలు, మాజీ ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు రూ.11 లక్షలు, శ్రీపూజిత డాల్‌మిల్లర్స్‌కు చెందిన చందోలు మల్లికార్జున రూ.10 లక్షలు, గీతాంజలి స్కూల్స్ యాజమాన్యం కిషోర్ రూ.5 లక్షలు, పెరల్స్ గురవయ్య రూ.2లక్షలు, గుత్తా సుబ్బారావు రూ.2లక్షలు, ఆరె శివారెడ్డి రూ.2 లక్షలు అందజేశారు. శివరాత్రికి ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల ప్రకటన బైలాకు విరుద్ధం

- ఎన్నికల నిర్వహణపై హైదరాబాదు కోర్టు స్టే ఉత్తర్వులు
- విలేకర్ల సమావేశంలో ప్రస్తుత రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు



కోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వుల కాపీలను చూపిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

నరసరావుపేట: ఏపీ ఆర్యవైశ్య మహాసభకు వచ్చే నెల 10, 11వ తేదీల్లో హైదరాబాదులో ఎన్నికలు నిర్వహించనున్నట్లుగా కార్యవర్గ మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు ప్రకటించటం బైలాకు విరుద్ధమని మహాసభ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ముక్కాల ద్వారకానాథ్, బిజినేపల్లి శరత్‌కుమార్ వెల్లడించారు. వెంకటేశ్వర్లు చేసిన ఎన్నికల ప్రకటనపై హైదరాబాద్‌లో 25వ అదనపు సిటీ సివిల్ కోర్టు స్టే ఉత్తర్వులు మంజూరు చేసిందంటూ ఆ కాపీల్ని ప్రదర్శించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయ మినీ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మహాసభకు వందేళ్ల చరిత్ర ఉందన్నారు. దీనికి అద్భుతమైన బైలా ఉందని, ఆర్యవైశ్యులంతా గౌరవిస్తూ కిందిస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు భగవద్గీతగా భావిస్తుంటారని తెలిపారు. దీనికి విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు కొంతమంది పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఖండించారు. వారి ప్రకటనతో ఆర్యవైశ్యులంతా సందిగ్ధంలో పడ్డారన్నారు. దీంతో కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఉత్తర్వులు తీసుకున్నట్లు చెప్పారు. బైలాకు వ్యతిరేకంగా నిర్ణయాలపై కోర్టు ఉత్తర్వుల్ని జారీ చేసిందని తెలిపారు. నవంబరులోపు మండలం, జనవరిలోపు జిల్లా, ఏప్రిల్, మార్చిలో రాష్ట్ర ఎన్నికలు నిర్వహించాలని తమ కమిటీ నిర్ణయం ప్రకటించిందన్నారు. వచ్చే ఏప్రిల్‌లో నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని వారు ప్రకటించారు. అప్పటివరకు తమ కార్యవర్గమే పని చేస్తుందని వివరించారు. ఈలోపు నిర్వహించే ఎన్నికలు మహాసభ ఎన్నికలు కాబోవని వారు ప్రకటించారు. ఏపీ ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ , మహాసభ గౌరవాధ్యక్షుడు గుబ్బా చంద్రశేఖర్ మాట్లాడుతూ మాజీ అధ్యక్షులంతా కలసి ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించాలని, స్టేట్ కౌన్సిల్ మెంబర్లను నియమించిన తర్వాతనే జరపాలన్నారు. వీటిని పక్కన పెట్టి ఈ విధంగా ప్రకటన చేయడం సబబు కాదని తెలిపారు. పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ (పాడా) మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభకు రాజకీయ రంగు పులమడం ఏ మాత్రం మంచిది కాదని హితవు పలికారు. విజయవాడలో మహాసభ భవనం నిర్మాణంలో ఉందని, అది వచ్చే మార్చి నాటికి పూర్తిచేసి అనంతరం ఎన్నికలు నిర్వహించాలని ప్రస్తుత కార్యవర్గం ఏనాడో నిర్ణయించిందని వెల్లడించారు. భవన నిర్మాణానికి అందరూ సహకరించాలని, ఆర్యవైశ్యులు అందరూ సఖ్యతగా ఉండాలని ఆయన సూచించారు. మహాసభ గౌరవాన్ని కాపాడుకుంటూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో యువజన సంఘ ప్రధాన కార్యదర్శి దివ్వెల రామకృష్ణ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అడ్డగిరి ద్వారక, పట్టణ అధ్యక్షుడు కొత్తూరి కోటేశ్వరరావు, పీఆర్వో ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలీస్ ప్రతిష్ట ఇనుమడింపజేయాలి

నూతన ఎస్ఐలకు సూచించిన జిల్లా ఎస్పీ

నరసరావుపేట: పోలీసుల ప్రతిష్ట ఇనుమడించేలా విధులు నిర్వహించాలని నూతన ఎస్ఐలకు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. జిల్లా పరిధిలో ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా మాచవరం, పిడుగురాళ్ల పట్టణ ఎస్ఐలుగా ఎస్ఐగా సమీర్ బాషా, కోటయ్య నియమితులయ్యారు. శుక్రవారం వారు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సమర్థంగా, బాధ్యతగా విధులు నిర్వహించాలని, ప్రజలకు సత్వర న్యాయం అందే విధంగా చర్యలు తీసుకుంటూ పోలీసు ప్రతిష్ట ఇనుమడింప చేసే విధంగా పని చేయాలని ఆదేశించారు. గతంలో కోటయ్య మాచవరం ఎస్ఐగా పనిచేస్తూ పిడుగురాళ్ల బదిలీ కాగా, ఎస్ఐ సమీర్ భాషా రెంటచింతలలో పనిచేస్తూ మాచవరానికి బదిలీ అయ్యారు.

రెండు వికెట్ల తేడాతో సెక్రటరీస్ లెవెన్ జట్టు విజయం



బ్యాట్స్‌ఉమన్ మెహరి హారి

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ అండర్ -23 ఉమెన్ స్టేట్ ప్రాబబుల్స్ వన్డే క్రికెట్ పోటీల్లో భాగంగా శుక్రవారం ప్రెసిడెంట్స్ లెవెన్-సెక్రటరీస్ లెవెన్ జట్ల మధ్య పోటీ జరిగింది. ఇందులో సెక్రటరీస్ లెవెన్ జట్టు రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని, 42.5 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌ఉమన్ సీహెచ్. మెహరి హారి 109 బంతుల్లో ఆరు ఫోర్లతో 49 పరుగులు సాధించింది. మరో బ్యాట్స్‌ఉమన్ కె.వై.ఎం.వి. వర్ధని 36 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్స్‌తో 35 పరుగులు సాధించింది. సెక్రటరీస్ లెవెన్ జట్టు బౌలర్లు ఎ. విష్ణుప్రియ 8.5 ఓవర్లలో 22 పరుగులిచ్చి మూడు వికెట్లను పడగొట్టింది. మరో బౌలర్ జి. సింధూజ నాలుగు ఓవర్లలో 19 రన్స్ ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టింది. అనంతరం 150 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సెక్రటరీస్ లెవెన్ జట్టు 30.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టు బ్యాట్స్‌ఉమన్ పి. రంగలక్ష్మి 32 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 46 పరుగులు సాధించింది. ప్రెసిడెంట్స్ లెవెన్ బౌలర్ ఎస్.ఆర్. శ్రీ చరణి అయిదు ఓవర్లలో 20 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టింది. మరో బౌలర్ లక్ష్మీ ప్రసన్న ఆరు ఓవర్లలో 26 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించింది.

నేత్రదానంపై విస్తృత ప్రచారం అవసరం



గుంటూరు మెడికల్: నేత్రదానంపై విస్తృత ప్రచారం అవసరమని నేషనల్ హెల్త్ మిషన్ డీపీహెచ్ఎంఒ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ పేర్కొన్నారు. నేత్రదానం పక్షోత్సవాల ముగింపు సందర్భంగా గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రత్నమన్మోహన్ మాట్లాడుతూ నేత్రదానంతో మనిషి చనిపోయినా కళ్లు బతికే ఉంటాయని, అంధులకు చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. అనేక మంది అపోహలతో నేత్రదానం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. నేత్రదానంపై అపోహలు తొలగించేందుకు డాక్టర్ రత్నమన్మోహన్ తన నేత్రాల్ని దానం చేస్తున్నట్లు ప్రతిజ్ఞ చేసి, దరఖాస్తు చేశారు. అనంతరం వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు 220 మంది నేత్రదానం చేస్తామని ప్రతిజ్ఞ చేసి సంబంధిత దరఖాస్తులు పూర్తి చేశారు. నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ప్రభుత్వ మహిళ కళాశాల, ఏసీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతుల్ని డాక్టర్ రత్నమన్మోహన్ అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ కంటి వైద్య విభాగాధిపతి డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

బ్యాంక్ అప్రైజర్ మోసంపై కేసు నమోదు

- 50 గోల్డ్‌ఖాతాల్లో నకిలీ బంగారం
- 23 మంది బినామీలతో ఖాతాలు
- మొత్తం రూ.87.91 లక్షలు గోల్డ్‌లోన్
- వడ్డీతో కలిపి మొత్తం రూ.93 లక్షలు
- మరో 304 గ్రాముల బంగారంతో ఉడాయించినట్లు ఫిర్యాదు
- బ్యాంక్ మేనేజర్ ద్వారా పోలీసులు వివరాలు తీసుకుని కేసు నమోదు

యడ్లపాడు: నకిలీ గోల్డ్ తనఖా పెట్టి బ్యాంక్‌కు టోకరా వేసిన అప్రైజర్ హరీష్ విషయం అందరికీ తెలిసిందే. దీనిపై బ్యాంక్ అధికారులు పోలీసులకు నకిలీ గోల్డ్, వాటిపై తీసుకున్న రుణం, వడ్డీ తదితర విషయాలపై గతనెల 30న యూనియన్‌బ్యాంక్(యూబీఐ) యడ్లపాడు శాఖలో వెలుగు చూసిన ఘటనపై బ్యాంకర్లు అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సదరు అప్రైజర్ ఎంతకాలంగా..ఎన్ని ఖాతాలలో.. బినామీ పేర్లతో.. ఎంత నకిలీ బంగారం పెట్టి.. ఎంత రుణం తీసుకున్నడనే అంశంపై నాటి నుంచి వరసగా నాలుగు రోజుల పాటు వృత్తి నిపుణులతో గోల్డ్‌లోన్ల ఖాతాలపై సమగ్ర పరిశీలన చేయించారు. బ్యాంక్ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ ఆడిట్‌లో ఆ బ్యాంక్‌లోని 1886 గోల్డ్ ఖాతాల్లో 50 ఖాతాల్లో అప్రైజర్ హరీష్ నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. 23 మంది బినామీ పేర్లతో పెట్టిన ఈ బంగారంపై రూ.87.91 లక్షల రుణం తీసుకున్నట్లు తేల్చారు. ఆయా ఖాతాలకు తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రూ.93 లక్షలు అయినట్లు లెక్కలు కట్టారు. 2015 నుంచి పథకం ప్రకారంగా తమ బ్యాంక్‌లో నకిలీ బంగారాన్ని పెట్టి రూ.2 లక్షల కంటే తక్కువగా రుణం పొందుతున్నట్లు వారి పరిశీలనలో తేలింది. అప్రైజర్ మోసం వెలుగు చూసేందుకు కారణమైన ఏడు ఖాతాలదారులు తనఖా పెట్టిన 304 గ్రాముల బంగారంతో ఉడాయించినట్లు తమ ఫిర్యాదులో యడ్లపాడుశాఖ యూబీఐ మేనేజర్ తిలక్ పోలీసులకు పూర్తి వివరాలను అందించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. అయితే బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ తీసుకున్న ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని, కేవలం బ్యాంక్‌కు మాత్రమే అప్రైజర్ నష్టం కలిగించినట్లు యూబీఐ అధికారులు వెల్లడించారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆయా వివరాల ప్రకారంగా శుక్రవారం కేసు నమోదు చేసుకుని చిలకలూరిపేట సీఐ వై.అచ్చయ్య ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

దేహ దారుఢ్య పరీక్షల్లో 304 మంది అర్హత





100 మీటర్ల పరుగు పందెంలో, లాంగ్ జంప్ పందెంలో అభ్యర్థులు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజు పర్యవేక్షించారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థుల ధ్రువపత్రాల్ని సిబ్బంది పరిశీలించారు. బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతల వివరాల్ని నమోదు చేసుకున్నారు. అనంతరం 100 మీటర్ల, 1,600 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. 650 మంది అభ్యర్థులు హాజరవ్వగా, 304 మంది అర్హత సాధించారు. ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్, ఏఎస్పీలు కె.సుప్రజ(గుంటూరు), మహేష్(బాపట్ల) పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రవిచంద్ర (దిశ పీఎస్, పల్నాడు జిల్లా), చంద్రశేఖర్ (గుంటూరు ఏఆర్), ఐజీ కార్యాలయ సీఐ సుధాకర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రోటోఫెస్ట్ ప్రారంభం

గుంటూరు వెస్ట్(క్రీడలు): యువతను, చిన్నారులను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో రోటోఫెస్ట్-2023 నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కె.వి.భాస్కరరావు తెలిపారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్ర వారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 24వ తేదీ స్పోర్ట్స్, కల్చరల్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. న్యూ జనరేషన్ మంత్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తం 36 విభాగాల్లో నిర్వహించే ఈ కార్యక్రమం ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 3,000 నుంచి 4,000 మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశముందని చెప్పారు. విజేతలను అదే రోజు ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. అనంతరం భాస్కరరావు, క్లబ్ కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారి కె.బి.వి.ప్రసాద్, డైరెక్టర్స్ కె.పి.కె.విశ్వేశ్వరరావు, బాచనబోయిన ఆంజనేయులు రోటోఫెస్ట్-2023 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మీడియా ఇన్‌చార్జ్ సుబ్బారావు పాల్గొన్నారు.